# మా వాడు, మా గొంతు

రామారావు దొర*

**త**మ ఆత్మబంధువని ఆదివాసులు మనస్ఫూర్తిగా చెప్పుకోదగిన ఏకైక బయటి వ్యక్తి బాలగోపాల్. ఆకలి, అనారోగ్యాలతో మనుగడే ప్రశ్నార్థకంగా మారిన ఆదివాసీ జన శ్రేయస్సు కోసం పరితపించిన మానవతామూర్తి ఆయన. తమకు ఏకైక జీవనాధారంగా ఉన్న ప్రకృతిని సైతం అభివృద్ధి పేరుతో తమ నుంచి లాగేసుకుంటున్న పాలకుల వికృత విధానాలను ఆదివాసుల తరపున కడకంటా వకాల్తా పుచ్చుకొని మరీ నిలదీసిన ఆదివాసీ పక్షపాతి డాక్టర్ బాలగోపాల్.

సాదాసీదాగా, ఎంతో వినమ్రంగా కనిపించే ఆ నిలువెత్తు మానవతావాదిని నేను తొలిసారి 2001 జూన్ 10న డుంబ్రిగుడలో కలిసాను. టూరిస్టు పరిశ్రమ కోసం బొటానికల్ గార్డెన్ నిర్మించడానికి ఆదివాసీ పంట భూములను అప్పగించే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన విద్యార్థి సంఘం (జి.ఎస్.యు) ఆనాడు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఆ కృషి వల్ల 250 ఎకరాల పంట భూమి ఆదివాసులకు మిగిలింది. హక్కుల నేతగా ఆయన నిర్వహించిన కార్యక్రమాలతో నాకు ఆనాటినుంచీ అనుబంధం ఉంది.

స్వాతంత్ర్య షష్ఠిపూర్తి సంబరాలు ముగిసిన ఐదోరోజునే 2007లో జి. మాడుగుల మండలం వాకపల్లిలో ఆదివాసీ మహిళలపై కూంబింగ్ పోలీసులు అత్యాచారానికి పాల్పడ్డ సంగతి అందరికీ తెలిసిందే. ఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి సాక్ష్యాధారాలు దొరక్కుండా చేయడం కోసం పోలీసులూ, జిల్లా అధికారులూ చేయని ప్రయత్నం లేదు. అత్యాచారానికి వెలకట్టి తలా ఐదులక్షలు ఇస్తామన్నా బాధితులు

* జర్నలిస్టు, హెచ్.ఎం.టి.వి, పాడేరు

ఒప్పుకోలేదు. దీనితో ఈ అకృత్యానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టిన విద్యార్థి, ఉద్యోగ, ప్రజా సంఘాల ప్రతినిధులను పోలీసులు బెదిరించారు. చివరకు గతిలేని పరిస్థితుల్లో బాధిత ఆదివాసీ స్త్రీలే స్వయంగా పిల్లా పాపలతో వచ్చి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య జరిగిన వాకపల్లి ఉద్యమానికి బాలగోపాల్ గారు ఎంతో ఆసరాగా నిలిచారు. ప్రత్యక్ష ఉద్యమంలోనూ, న్యాయ పోరాటంలోనూ ఆయన అందించిన సహాయ సహకారాలను ఎవ్వరమూ మర్చిపోలేము. జిల్లా కోర్టు కేసును కొట్టేసిన సందర్భంలో హైకోర్టులో కేసు వేసి నిలబెట్టారు. కేసు విచారణకు వస్తున్న క్షణాన ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం.

ఆస్తుల్లో అపర కుబేరులూ, బతుకుల్లో కటిక దరిద్రులూ ఆదివాసులు. వారున్న అటవీ ప్రాంతం పాలకులకూ, పెట్టుబడిదార్లకూ గొప్ప ముడిసరుకు. అభివృద్ధి పేరుతో ప్రాజెక్టులు, గనులు చేపడతామంటూ వారు ఆదివాసుల జీవనాధారాల్ని కొల్లగొడుతున్నారు. బాక్సయిట్ గనులూ, పోలవరం ప్రాజెక్టూ, టూరిస్టు పథకాలూ.... ఆదివాసుల పాలిట శాపంగా మారాయి. వారంతా విస్థాపనకు గురవుతున్నారు. ఆదివాసుల సంస్కృతి నాశనం అవుతోంది. అటవీ హక్కుల చట్టాన్నీ, పీసానూ, పర్యావరణ చట్టాన్నీ అతిక్రమించి మరీ ఆదివాసీ ప్రాంతాల దురాక్రమణకు పాలకులు పాల్పడుతున్న సందర్భంలో వారిని వారికున్న రాజ్యాంగ హక్కుల గురించి జాగృత పరిచే కార్యక్రమాన్ని బాలగోపాల్‌గారు చేపట్టారు. గొంతులేని వారికి గొంతునీ, అమాయక అరణ్యవాసులకి ఆసరానూ ఇచ్చిన బాలగోపాల్‌ని ఆదివాసీ సమాజం ఎన్నడూ మరువలేదు.

దేశ అంతర్గత యుద్ధంలో కూడా వారే బలికావడం ఆదివాసులు నేడు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య. రోగాలు రొష్టులతో సతమతమవడం ఒక ఎత్తయితే అనునిత్యం ఆదివాసుల్ని యుద్ధభూమిలో నిలబెట్టడం మరొక ఎత్తు. విశాఖ ఏజెన్సీలో 1987లో జరిగిన చింతపల్లి గృహ దహనాల నుంచి దీన్ని చూస్తూనే ఉన్నాం. 'అన్నలకు' ఆశ్రయమిస్తున్నారనే నెపంతో 46 గ్రామాల్లో 638 మంది ఆదివాసుల గుడిసెలను పోలీసులు తగులబెట్టి వారికి నిలువ నీడ లేకుండా చేసారు. ఆనాడు బాలగోపాల్ గారు చేసిన పరామర్శ బితుకు బితుకు మంటున్న ఆదివాసుల్లో ఎంతో ధైర్యాన్ని నింపింది. కారడవుల్లొంచి జనారణ్యంలోకి వచ్చి న్యాయం కోసం పోరాడగల సత్తానిచ్చింది. ఆయన ప్రయత్నాలతో ఇండియన్ పీపుల్స్ హ్యూమన్‌రైట్స్ ట్రిబ్యునల్ ఏర్పడి ఈ ఘటనపై విచారణ జరిపింది. కనీవినీ ఎరుగని రీతిలో ఉన్నత న్యాయమూర్తులతో విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయించిన సాహసి బాలగోపాల్.

వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి ఆకస్మికంగా మరణించినపుడు ఆయన బతికున్నంతకాలం ఆయనను తిట్టిపోసిన వాళ్ళతో సహా చచ్చిపోయిన వాడికళ్లు చారడేసి అంటూ ఆయనకు నివాళులర్పిస్తున్న సమయంలో బాలగోపాల్ గారొక్కరే 'నిత్య మరణాలకు నివాళి' ఎక్కడ అంటూ అనునిత్యమూ మలేరియా వంటి నివారించదగ్గ వ్యాధులవల్ల మరణిస్తున్న ఆదివాసుల దయనీయ స్థితిని ప్రధాన స్రవంతికి గుర్తు చేసారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిశితంగా విమర్శించారు.

న్యాయాన్ని హక్కుగా పొందాలంటే ఉద్యమించాల్సిందేనని ఉద్బోధించిన న్యాయవాది బాలగోపాల్. హక్కుల నిరాదరణకు గురైనవారు గొంతెత్తి మాట్లాడగలిగినపుడే హక్కులను అనుభవించగలగుతారని నమ్మిన హక్కుల ఉద్యమ కార్యకర్త ఆయన. చాలామంది మేధావులు తాము పని చేస్తున్న చోటును పదిలం చేసుకుంటుంటారు. బాలగోపాల్ గారు న్యాయవాదిగా ఉంటూ కూడా న్యాయవ్యవస్థపైనా, న్యాయమూర్తులపైనా అవసరమైన ప్రతి సందర్భంలోనూ నిష్పాక్షిక నిశిత విమర్శను ఎక్కుపెడుతూనే వచ్చారు. పౌర సమాజంలో దానిని చర్చకు పెడుతూనే ఉండేవారు.

ఆదివాసీ సమాజంతో ఆయనకున్న అనుబంధమే ఆయన్ను మాకు దగ్గర చేసింది. ఒరిస్సా ఆదివాసులు బాక్సైట్ గనుల తవ్వకానికి వ్యతిరేకంగా 'కుచిపాదార్'లో నిర్వహించిన ట్రిబ్యునల్‌కు బాలగోపాల్‌గారితో పాటు నేనూ హాజరయ్యాను. బాక్సయిట్ గనులకు వ్యతిరేకంగా అరకులో డిసెంబర్ 21, 2008న జరిగిన సెమినార్‌కు ఆయన వచ్చారు. విశాఖ – ఒరిస్సా సరిహద్దులోని కోటిపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు ఫిబ్రవరి 8, 2009న పాడేరు వచ్చారు. ఇది విశాఖ ఏజెన్సీకి ఆయన చివరి పర్యటన. ఆ రోజంతా ఆయనతో కలిసే ఉన్నాము.

అక్టోబర్ 8, 2009 అర్ధరాత్రి ఆయన మరణవార్త విని స్తంభించిపోయాను. బాలగోపాల్ గారు తరచుగా ఓ మాట అంటూండేవారు, ఆదివాసులకు సొంతగొంతు ఉండాలని, వారికి ప్రశ్నించే ధైర్యం రావాలని. బహుశా తానెంత కాలం ఉంటాను అని ఆయనకు అనిపిస్తుండేదేమో....